క్లుప్తంగా

కనులపండువగా సీతారాముల కల్యాణం


సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక సమీపంలో ఉన్న రామనారాయణంలో సీతారాముల కల్యాణం గురువారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్నపనం, పంచామృతాభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమాలను అర్చకుడు జీఎస్ హర్ష ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, శ్రీనివాసరాజు, ఏవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అన్నకూటాభిషేకం


కనకమహాలక్ష్మికి అన్నం నివేదన

విజయనగరం టౌన్: నగరంలోని సిటీ బస్టాండ్ వద్ద నున్న అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో గురువారం అన్నకూటాభిషేకం ఘనంగా నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమం నెల రోజులు పూర్తయిన నేపథ్యంలో భారీ ఎత్తున అన్నకూటాభిషేకం నిర్వహించినట్లు అర్చకుడు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ బీమా సొమ్ముతో నిరుపేద కుటుంబాలకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన నేతేటి పైడిరాజు ఇటీవల అకస్మికంగా మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య సంధ్యారాణికు రూ.10 వేల తక్షణ సహాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మొయిద అక్కోజీ, రాము, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

29న యంగ్ ఇండియా సదస్సు

విజయనగరం ఫూల్‌బాగ్: ఈనెల 29న విజయవాడలో నిర్వహించనున్న యంగ్ ఇండియా సదస్సును విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ వద్ద వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక విధానాలను ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ప్రతినిధులు డి. గణేష్, సీహెచ్ శంకరరావు, ఎం. వాసు, ఎస్. వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: పెన్షనర్ల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఎ. విశ్వనాథరాజు డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 11వ పీఆర్‌సీలో 01-01-2022 నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సోమరాజు, ఆదినారాయణ, కామరాజు, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ హరీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ లైబ్రరీ నుంచి కోట వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సతీష్, రామ్మోహనరావు పాల్గొన్నారు.


ట్యాబ్‌ల పంపిణీ

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ మామిడి అప్పలనాయుడు గురువారం బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పీబీఎస్ రామచంద్రరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కిలారి రాంబాబు, బి.ఆదినారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామయణ పారాయణం

విజయనగరం టౌన్: నగరంలోని రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శ్రీరాముని మహాసామ్రాజ్య పట్టాభిషేక కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామాయణ పారాయణం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 40 మందికి పైగా రుత్విక్కులు రామాయణ పారాయణం చేశారు.

జగనన్న కాలనీలు విజయనగరానికి మణిహారాలు..


గుంకలాం జగనన్న లే అవుట్‌లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు

- పట్టణ పరిధిలో 16,140 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు
- సుమారు 500 ఎకరాల్లో జగనన్న కాలనీల నిర్మాణం
- మండల పరిధిలో 1788 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు
- శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలో వస్తే ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తానని నవరత్నాల పథకాల్లో భాగంగా హామీ ఇచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేస్తున్నారు. నవరత్నాల పథకంలో భాగంగా ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లను మంజూరు చేసి వారి సొంతింటి కలను నిజం చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోగా స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి ఫలితంగా ఏర్పాటైన గుంకలాం లే అవుట్ రాష్ట్రంలోనే అతి పెద్దదైన జగనన్న లే అవుట్లలో ఒకటిగా నిలిచింది. 397 ఎకరాల విస్తీర్ణంలో ఒక మున్సిపాలిటీనే తలపించేలా జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేయగా, స్వయంగా ముఖ్యమంత్రి ప్రారంభించడం విశేషం. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని పేదలకు గుంకలాం, కొండకరకాం, సారిక గ్రామాల్లో స్థలాలను సేకరించి అతిపెద్ద లేఅవుట్లుగా తీర్చిదిద్ది పేదలకు పట్టాలు, ఇళ్లను మంజూరు చేశారు. లక్షల రూపాయల విలువైన ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు నిర్మాణానికి రుణం సహాయం చేయడం గొప్ప విషయమని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం జిల్లా కేంద్రం చుట్టూ జగనన్న లే అవుట్లు, కాలనీలు ఏర్పాటు కావడంతో నియోజకవర్గానికి మణిహారంగా మారాయని పలువురు చెబుతున్నారు.

397 ఎకరాల్లో 10,360 ఇళ్ల పట్టాలు

విజయనగరం మండలంలోని గుంకలాం గ్రామంలో 397 ఎకరాల్లో పట్టణ పేదలకు 10,360 ఇళ్ల పట్టాలను అందజేశారు. ఇప్పటికే సుమారు వెయ్యి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోగా మరో 9 వేలకు పైగా ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయి.


సారికలో జగనన్న కాలనీ ముఖద్వారం


మలిచర్లలో జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు

85 ఎకరాల్లో 2377 పట్టాలు

మండల పరిధిలోనే ఉన్న కొండకరకాం గ్రామంలో 85 ఎకరాలను సేకరించి పట్టణ పేదలకు 2,377 ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. ఇక్కడ కూడా ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.

సారికలో 3403 ఇంటి స్థలాలు

విజయనగరం కార్పొరేషన్ పరిధిలో మిగిలి ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలనే ధ్యేయంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషితో సారికలో మరో జగనన్న లేఅవుట్‌కు స్థలాన్ని సేకరించి, అందులో 3403 ఇళ్ల స్థలాలను సిద్ధం చేసి, ఇటీవలే లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

మండలంలో 1788 ఇళ్ల లబ్ధిదారులు

విజయనగరం మండలంలోని నారాయణపురం, బియ్యాలపేట, మలిచర్ల, చెల్లూరు, గొల్లలపేట, సారిక, కోరుకొండ, రాకోడు, జొన్నవలస, దుప్పాడ, గుంకలాం, ద్వారపూడి, కొండకరకాం గ్రామ సచివాలయాల పరిధిలో అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 1788 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయగా, ఇప్పటికే 826 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నారు.

సొంతింటి కల నెరవేరింది



మాకు సొంత ఇల్లు లేక విజయనగరంలో అద్దె ఇంటిలో ఉండేవారం. నా భర్త ఆటోడ్రైవర్ కావడంతో అద్దె చెల్లించడానికే ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాకు గుంకలాం జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. దీంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకున్నాం. లక్షల రూపాయల ఆస్తి ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– గంద్రేటి రాణి, లబ్ధిదారు, జగనన్న లేఅవుట్, గుంకలాం

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇంటి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేయడంతో సొంతింటి కలను నెరవేర్చుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్ల నాటి కల సాకారమైంది. జగన్‌బాబు రుణం తీర్చుకోలేనిది.

– కొర్నాన నారాయణమ్మ, గొల్లలపేట గ్రామ పంచాయతీ

బకాయిలు విడుదల చేయాలి


రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న పింఛన్‌దారులు

భోగాపురం: పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేసి, తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ పింఛన్‌దార్ల సంఘం భోగాపురం తాలుకా అధ్యక్షుడు వరుపుల భాస్కరరావు, జిల్లా జాయింట్ కమిటీ సభ్యుడు సీహెచ్ గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ పింఛన్‌దారులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. పింఛన్‌దారులకు పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు చెల్లించాలని, 11వ పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్‌కార్డు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధిని రూ. 2 లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జె. మాధవరావు, పి. బ్రహ్మారావు, ఆళ్ళ మాధవరావు, పల్లంట్ల ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పల వెలమలకు అత్యధిక సీట్లు కేటాయించాలి

- కొప్పల వెలమ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు గొట్టాపు చిన్నంనాయుడు


ఐక్యతను చాటుతున్న కొప్పల వెలమ సంక్షేమ సంఘ నాయకులు

విజయనగరం ఫోర్ట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొప్పల వెలమలు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో కొప్పల వెలమలకు అత్యధిక సీట్లు కేటాయించాలని కొప్పల వెలమ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు గొట్టాపు చిన్నంనాయుడు అన్నారు. గురువారం స్థానిక కామాక్షినగర్‌లో ఉన్న కొప్పల వెలమ సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏ పార్టీ కొప్పల వెలమలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందో ఆ పార్టీకి మద్దతు ఇస్తామని చెప్పారు. కొప్పల వెలమలను బీసీ- డీ నుంచి బీసీ-ఏ లో చేర్చాలని కోరారు. బొబ్బిలి, ఎస్.కోట, గజపతినగరం అసెంబ్లీ స్థానాలతో పాటు విజయనగరం ఎంపీ సీటును కూడా కొప్పల వెలమలకు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో సుమారు 22 లక్షల మంది కొప్పల వెలమ కులస్తులు ఉన్నారని చెప్పారు. సంఘం తరఫున చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

నూతన కార్యవర్గం..

కొప్పల వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా గొట్టాపు చిన్నంనాయుడు, రాష్ట్ర అధ్యక్షుడిగా కోరుపోలు పరదేశినాయుడు, జిల్లా అధ్యక్షుడిగా బొత్స వర ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా కాశినాయుడు తెంటు, ట్రెజరర్‌గా కె. కృష్ణమూర్తి, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా దొగ్గ దేముడుబాబు, ప్రధాన సలహాదారుడు వైకుంఠం వెంకటనాయుడు, పట్టణ అధ్యక్షుడిగా యాంద్రపు తాతబాబు, ప్రధాన కార్యదర్శిగా బోకం మురళి నియమితులయ్యారు.

సత్కారం..

నెల్లిమర్ల: స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకుడు కందిపల్లి రామకృష్ణారావును సహచరులు గురువారం సత్కరించారు. రామకృష్ణారావు ఇటీవల నాగార్జున యునివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఎస్ఆర్ శర్మ, తదితరులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, జీజీహెచ్ఎస్ నాగేశ్వరరావు, డి. ఈశ్వరరావు, పి. రవికుమార్, పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని ముడిదాం గ్రామ సమీపంలోని ఇన్‌స్పైర్ పాఠశాలలో గురువారం నిర్వహించిన కెరీర్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ.. డబ్బు, పేరుకన్నా చదువుతోనే మనిషికి గౌరవం లభిస్తుందని చెప్పారు. సత్సంకల్పంతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ రవి కె. మండా, డైరెక్టర్లు అప్పలరాజు, బత్తుల చందు, రవ్వ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి..

- సంఘమిత్ర ఆర్ఎస్ జాన్

విజయనగరం టౌన్: సమిష్టి కృషితోనే సీబీసీఎన్‌సీ అభివృద్ధి చెందుతుందని సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ అన్నారు. గురువారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 69వ కన్వెన్షన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చ్ ఆఫ్ నార్తరన్ సర్కార్స్ (సీబీసీఎన్‌సీ) సర్వజనీన మహాసభకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో సీబీసీఎన్‌సీ అధ్యక్షుడు ఎమ్.ఎ.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి


వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన మహిళా క్రీడాకారులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని, నియోజకవర్గస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజేతలుగా నిలవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 24 నుంచి నిర్వహిస్తోన్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో గురువారం సాయంత్రం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎంపీపీ మామిడి అప్పలనాయుడులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన మొదటి మూడు జట్లకు క్రీడాంశాల వారీగా రూ.35,000, రూ.15,000, రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. అదేవిధంగా బ్యాడ్మింటన్ క్రీడాంశంలో విజేతలుగా మొదటి ముగ్గురికి రూ.20,000, రూ.10,000, రూ.5,000 చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, కార్పొరేటర్లు కనకల నాగవల్లి, గాదం మురళి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, పలువురు పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో విజేతలు వీరే....

- పురుషుల క్రికెట్ పోటీల్లో మొదటి స్థానం ఫూల్‌బాగ్ కాలనీ ప్రథమ స్థానం దక్కించుకోగా, ద్వితీయ స్థానాన్ని బొబ్బాది పేట, తృతీయ స్థానాన్ని నారాయణపురం జట్లు దక్కించుకున్నాయి.
- బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో ఫూల్‌బాగ్‌కాలనీ, నారాయణపురం, ప్రదీప్‌నగర్ సచివాలయ జట్లు .... మహిళల విభాగంలో బాబామెట్ట, ప్రదీప్ నగర్, బియ్యాలపేట జట్లు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నాయి.
- కబడ్డీ క్రీడాంశంలో పురుషుల విభాగంలో పేర్లవారి జంక్షన్, ధర్మపురి, జొన్నవలస జట్లు.... మహిళల విభాగంలో సారిక, మహరాణిపేట, కణపాక జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.
- ఖోఖో క్రీడాంశంలో పురుషుల విభాగంలో బాబామెట్ట, జొన్నవలస, వీటీ అగ్రహారం జట్లు.... మహిళల విభాగంలో ఫూల్‌బాగ్‌కాలనీ, జొన్నవలస, పోలీస్ బ్యారెక్స్ జట్లు విజేతలుగా నిలిచాయి.
- వాలీబాల్ క్రీడాంశంలో పురుషుల విభాగంలో శివాలయం వీధి, ఖాలీఘాట్‌కాలనీ, కొండకరకాం జట్లు.... మహిళల విభాగంలో బాబామెట్ట, కణపాక, గుంకాలం జట్లు వరుస స్థానాల్లో నిలిచాయి.

'గడప గడపకు..' కార్యక్రమానికి స్పందన


ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నగరంలోని 3వ డివిజన్ ఫూల్‌బాగ్ 4వ బిట్‌లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జ్‌లు వేముల రాంప్రసాద్, మెండా రమణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల తీరు ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ పాలనపై పూర్తి సంతృప్తితో ఉన్నారని, జగనన్నకు మద్దతు తెలియజేస్తున్నారని చెప్పారు. స్థానికంగా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణతో నిత్య ఆదాయం

- పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు వైవీ రమణ


రఘుమండలో లేగ దూడల ప్రదర్శన

డెంకాడ: పశుపోషణ ద్వారా రైతులకు నిత్యం ఆదాయం వస్తుందని జిల్లా పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ వైవీ రమణ అన్నారు. మండలంలోని రఘుమండలో ఏడాదిలోపు ఉన్న ఆడ దూడల ప్రదర్శన గురువారం నిర్వహించారు. 73 లేగ దూడలను ప్రదర్శనలో ఉంచగా.. ఆరోగ్యంగా మూడు దూడలను ఎంపిక చేసి యజమానులకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఉప సంచాలకుడు వైవీ రమణ మాట్లాడుతూ, పాడిపశువుల సంరక్షణ ఎంత అవసరమో లేగ దూడల సంరక్షణ కూడా అంతే అవసరమన్నారు. దూడలు పాడి పశువులుగా మారి పాల ఉత్పత్తి చేస్తాయని, దీని ద్వారా రైతులకు పాల ఉత్పత్తి పెరిగి మంచి ఆదాయం లభిస్తుందని వివరించారు. ఆడ పెయ్యిలకు ఖనిజ, లవణ మిశ్రమం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ దామోదరరావు, ఏరియా పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు మహాపాత్రో, సర్పంచ్ గూడేల విష్ణు, మండల పశువైద్యాధికారులు కొల్లి సంతోషకుమార్, గోవర్ధన్‌సాగర్, మర్రాపు శ్రీకాంత్, గ్రామాల్లో ఉన్న పశుసంవర్ధకశాఖ సహాయకులు, రైతులు హాజరయ్యారు.

పంట నమోదు తప్పనిసరి

- వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు నాగభూషణం


సింగవరంలో మొక్కజొన్న పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ నాగభూషణం, తదితరులు

డెంకాడ: మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎం.నాగభూషణం అన్నారు. మండలంలోని సింగవరంలో మొక్కజొన్న పంట నమోదు ప్రక్రియను ఏడీఏ నాగభూషణం గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దిగుబడి విక్రయించాలన్నా, ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్ట పరిహారం పొందాలన్నా తప్పనిసరిగా పంట వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం చోడి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల, ఏఈఓ బి.రామకోటి, రైతులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం...


పూసపాటిరేగ: మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ భాస్కరరావు, తదితరులు

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం, సీనియర్ ఓటర్లను సత్కరించడం, తదితర కార్యక్రమాలు చేపట్టి ఓటు ఆవశ్యకతను వివరించారు. అలాగే విద్యార్థులు, యువత ఓటుహక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

– నెల్లిమర్ల నెట్‌వర్క్


డెంకాడ: ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


భోగాపురం: ఓటర్ దినోత్సవ ముగ్గులను పరిశీలిస్తున్న తహసీల్దార్ చింత బంగార్రాజు, తదితరులు


నెల్లిమర్ల: ప్రతిజ్ఞ చేస్తున్న మిమ్స్ అధికారులు, విద్యార్థులు